ఫ్రీ డెలివరీ



మాకాలనీ నగరం బయట అఘోరించిందన్న విషయం మీకు తెలుసుకదా! మాదేకాదు. మాలాంటి మిడిల్‌క్లాస్ పక్షులందరూ నగరానికి చాలాదూరంగా నెట్టివేయబడడం వల్ల వెలసిన కాలనీలు చాలా వున్నాయ్ మా చుట్టుపక్కల. ఈ కాలనీల్లో వాళ్ళెవరూ సాధారణంగా ఓట్లువేయరు, వేసినా ప్రతిపక్షానికే వేస్తారు. గనుక ఈ కాలనీల గురించి పట్టించుకునే వారెవవరూ ఉండరు.

ముఖ్యంగా మా నిర్భయ్ నగర్ కాలనీ పరిస్థితి మరీదారుణం. మంచి నీళ్ళసప్లయ్ ఉండదు. రోడ్లసంగతి మీకు తెలుసుకదా! లైట్లు సరేసరి! దోపిడీలకు వచ్చే దొంగలు టార్చ్‌లైట్స్ వేస్తేనేగాని రాత్రిళ్ళు కాంతి ఎలా ఉంటుందో తెలీదు. (రోడ్‌లాంటి చోట) రాత్రి తొమ్మిదిదాటితే బస్‌లు కనిపించవ్. ఒకటే ఒక్క బ్యాంక్‌వుందిగానీ అది నేషనలైజ్ అయిన దగర్నుంచీ వీలయినంతవరకు కస్టమర్స్‌ని చిత్రహింసలు పెట్టి ఎకౌంట్స్ ఎత్తేసుకుని పారిపోయేలా చేస్తోంది. ఎందుకంటే వర్క్‌లోడ్ తగ్గించాడానికని ఉద్యోగులు అనధికార పూర్వకంగా చెప్పారు.

ఇలాంటి పరిస్థితుల్లో ఓ రోజు తెల్లారుజామున నాలుగ్గంటలకు మా ఇంటి తలుపు గట్టిగా కొట్టడం వినిపించి మెలకువ వచ్చిందినాకు. ఛటుక్కున లేచి కూర్చున్నాను. ఒకవేళ దొంగలేమో అని అనుమానం వచ్చింది. కాలండర్‌వేపు చూశాను. అవి నెలాఖరు రోజులు గనుక దొంగలయి వుండరని అర్థమయిపోయింది. (వాళ్ళు సాధారణంగా జీతాలు వచ్చిన ఒకటి రెండు రోజుల్లోనే వచ్చేస్తారు) మా ఆవిడ నిద్రలో "విశ్వామిత్ర విశ్వామిత్ర" అంటూ కలవరిస్తోంది.

"ఏయ్ లేలే! ఎవరో తలుపు కొడుతున్నారు చూడు!" అంటూ గట్టిగా అరిచేసరికి ఉలిక్కిపడి లేచి గాబరాగా నావేపు చూసింది.

"ఏవండీ! అన్నగారి విశ్వామిత్రను నిజంగా సుప్రీంకోర్టువాళ్ళు ఆపేశారా?" అంది ఖంగారుగా.

"నీ మొఖం! అదంతా నీకలగానీ వెళ్ళి తలుపుతియ్ ఎవరోవచ్చారు" అన్నాను సర్దిచెపుతూ. ఆమె అది కల అయినందుకు సంతోషిస్తూ వెళ్ళి తలుపు తెరిచింది. శాయిరామ్ ఆదుర్దాగా లోపలికొచ్చాడు. నాకు వళ్ళు మండిపోయిందతన్ని చూసేసరికి.

"ఏం బ్రదర్! నీకు రాత్రీ, పగలూ, తెల్లారూజామూ, అంటూ తేడాలేమీ లేవా?" అన్నాను కోపంగా.

కానీ శాయిరామ్ మామూలుగానే నన్ను పట్టించుకోలేదు.

"అర్జంటుగా పదుగురూ! మనకాలనీ రైటర్ చంద్రకాంత్ ఛటోపాధ్యాయ భార్యకు నొప్పులొస్తున్నాయట! అర్జంటుగా డెలివరీకి హాస్పిటల్‌కి తీసుకెళ్ళాలి!" అన్నాడు హడావుడిగా.

నాకు నిద్రమత్తంతా ఎగిరిపోయింది.

అడపాదడపా ఇలాంటి సంఘటనలు జరగడం మామూలే మా కాలనీలో! అలాంటి సమయాల్లో ఎంత చిత్రవధ అనుభవించాలో కూడా మా అందరికీ అనుభవపూర్వకంగా తెలుసు. ఇంక లాభంలేదని మా ఆవిడతోపాటు చంద్రకాంత్ ఇంటికి చేరుకున్నాను. బయటే రంగారెడ్డి, గోపాల్రావ్, యాదగిరి, జనార్ధన్, డిటెక్టివ్ రచయిత్రి రాజేశ్వరి, పార్వతీదేవి అంతా నిలబడి వున్నారు, చంద్రకాంత్ వాళ్ళందరి మధ్యా తప్పుచేసినవాడిలా తలవంచుకుని నిలబడి వున్నాడు.

"అది కాదోయ్! మీ ఆవిడ ఏ రోజయినా డెలివరీ అవచ్చని తెలుసుకదా! తెలిసికూడా ఊరిబయట కాలనీలో వుంచితే ఎలా అనుకున్నావ్? రెండ్రోజులు ముందే ఏదయినా ప్రైవేట్ నర్సింగ్‌హోంలో ఎందుకు చేర్పించలేదు?" కసురుకుంటున్నాడు రంగారెడ్డి.

"చేర్పిద్దామనకున్నాను గానీ ప్రైవేటు నర్సింగ్‌హోమ్‌లో అయితే సిజేరియన్ ఆపరేషన్

చేస్తారుకదా! దానికి బోలెడు డబ్బు కట్టాల్సివస్తుందని– ఇంట్లోనే వుంచేశాను" అన్నాడు భయంగా.

మాకు అతని మాటలు సరిగ్గా అర్థం కాలేదు.

"ఏమిటి? సిజేరియన్ ఆపరేషన్ చేస్తారా? నీకేం మతిపోలేదుకదా! సిజేరియన్ ఆపరేషన్ ఎందుకుచేస్తారు? ఎవరికయినా డెలివరీ కష్టం అయితే, తప్పనిసరి పరిస్థితుల్లో చేస్తారు" అన్నాడు గోపాల్రావ్.

"అవి పాతరోజులు గురూ! ఇప్పుడు కావాలని ప్రతివాళ్ళకీ సిజేరియన్ చేసేస్తున్నారు"

"ఎందుకలా?"

"ఫీజు ఎక్కువ వస్తుందని! మామూలు డెలివరీ అయితే బిల్ ఎక్కువ అవడం లేదని ఈ కొత్తపద్ధతి ఇంట్రడ్యూస్ చేశారు. ఈ పద్ధతి కనిపెట్టాక యిప్పుడు నర్సింగ్‌హోంల లాభం తెగపెరిగిపోయిందట."

మాకేం చేయాలో తెలీలేదు.

"ఇప్పుడామెని గవర్నమెంట్ హాస్పిటల్ కెలా తీసుకెళ్ళడం?" అడిగాడు గోపాల్రావ్.

"ఎవర్నయినా ఆటోకి పంపించండి"

మరుక్షణం జనార్ధన్ ఓ మోపెడ్‌మీద ఆటోవేటకు వెళ్ళిపోయాడు. అతను తిరిగివచ్చే సరికి తెల్లారిపోయిందిగానీ ఆటో రాలేదు.

"ఆటో ఏమయింది?" అడిగాడు రంగారెడ్డి ఆదుర్దాగా.

"ఆటోలు ఎక్కడాలేవు! ఒకే ఒక్కటి ఎన్.టి.ఆర్.నగర్ దగ్గర వుంది. కానీ డ్రయివర్ ఉదయం ఎనిమిదిగంటలగ్గాని నిద్రలేవడట."

"మీటర్ మీద అయిదు రూపాయలు ఎక్కువ ఇస్తాననకపోయారా?"

"వందరూపాయ లెక్కువిచ్చినా నిద్ర డిస్టర్బ్ అవనీడట "నేనేం గవర్నమెంట్ సర్వెంట్ ననుకున్నారా?– ఒకటైమూపాడూ లేకుండా పనిచేయడానికి" అంటూ కసురుకున్నాడు.

అందరం మొఖాలు చూసుకున్నాం.

"ఏం చేద్దాం?" అడిగాడు శాయీరామ్.

నేను టైమ్ చూసుకున్నాను.

ఏడవుతోంది.

"ఎనిమిదయితేగానీ ఆటోలు మన కాలనీవరకూ రావు" అన్నాడు గోపాల్రావ్.

"అయితే అప్పటివరకూ ఆగుదాం! మనందరం కూడా అప్పటికి మొఖాలు కడుక్కుని రడీ అయిపోవచ్చు" అన్నాడు జనార్ధన్.

అతని ఆలోచన బాగానేవుందని ఎవరిళ్ళకు వాళ్ళు బయలుదేరాం. మళ్ళీ ఎనిమిది గంటలకల్లా అందరం చంద్రకాంత్ ఇంటి దగ్గర ఎసెంబుల్ అయ్యాం.

చివరకు ఎనిమిదిన్నరకు ఓ ఆటో కనిపించింది.

అందరం పరుగుతో వెళ్ళి రోడ్డుకడ్డంగా చేతులుపట్టుకుని నలబడ్డాం. మా చేతులమధ్య నుంచి దూరిపోవడానికి ప్రయత్నించి వెనుకకూడా ఇంకోరెండు వరుసల్లో మా కాలనీ వాళ్ళు అడ్డంగా నిలబడటం వల్ల గత్యంతరంలేక ఆపేశాడతను.

అందరం కలసి అతనిని బ్రతిమిలాడాము. రూల్స్ ప్రకారం అతనెలాగూ ఆటో నడపడన్న విషయం మాకు తెలుసునని, కేవలం జంటనగరాల పౌరులమీద, జాలితో, త్యాగనిరతితో ఆటోనడుతున్నాడన్న సంగతి మేము అర్థంచేసుకున్నామని చెప్పాము. ఎలాగయితేనేం, మీటర్‌మీద పదిరూపాయలు ఎక్స్‌ట్రా ఇవ్వడానికి మేమంతా అంగీకరిచడంతో అందరం ఆనందంగా ఆటోని జాగ్రత్తగా కాపాడుతూ (వెనక్కి తిరిగి పారిపోకుండా) కాలనీలోకి తీసుకొచ్చాము.

చంద్రకాంత్ భార్యను ఆడాళ్ళు అందరూ కలసి ఆటోలోకి చేర్చారు. మామిసెస్ ఆమెను జాగ్రత్తగా పట్టుకుని కూర్చున్నాక ఆటో బయల్దేరింది.

మేమంతా వెనుక మా కాలనీ వాళ్ళ మోపెడ్స్‌మీదా, స్కూటర్లమీదా బయల్దేరాం. సరిగ్గా చాదర్‌ఘాట్ బ్రిడ్జి దగ్గరకొచ్చేసరికి పోలీస్ విజిల్స్ మార్మోగిపోయినయ్. కొంతమంది ట్రాఫిక్ పోలీసులు గట్టిగా కేకలువేస్తూ మా ఆటోనీ, స్కూటర్లనూ మిగతా ట్రాఫిక్ తోపాటు ఆపేశారు.

అన్ని వేపులా ట్రాఫిక్ ఆగిపోయింది.

"ఇదేమిటి? ఎటోకటు వెళ్ళనీయాలి కదా! అన్ని సైడ్సూ ట్రాఫిక్ అలా ఆపేశారేమిటి?" ఆశ్చర్యంగా అడిగాడు శాయీరామ్ నన్ను.

శాయీరామ్ గొంతువినడంతోనే ఓ ఇన్‌స్పెక్టర్ గట్టిగా కేకలువేస్తూ మా మీదకు దూసుకొచ్చాడు.

"ఏయ్? తుమ్‌లోగోంకో ఆకల్‌నై హైక్యా? ఖామోషీసే ఖడేహోజావ్" అన్నాడు శాయీరామ్‌ని కొట్టేట్లు చూస్తూ.

"అరే! ఎందుకాపారు అనడిగితే అంత కోపమెందుకండీ?" మొండిగా అడిగాడు శాయీరామ్. ఇన్‌స్పెక్టర్ ఇంకా మండిపడిపోయాడు.

"సైలెన్స్!" అంటూ ఫాక్టరీ సైరన్‌లా అరచాడు.

దాంతో అందరూ నిశ్శబ్దమయిపోయాం.

ఈలోగా మా వెనుక ఎవరో ఆటోవాడు హారన్‌కొట్టడంతో పిచ్చికోపంతో అటువేపు పరుగెత్తాడతను.

"సాలే-కోనైరే హారన్‌మారేసు? షరమ్ నైహై తేరేకో? సబ్‌లోగ్ ఖామోషీసే ఖడేహోజావ్!" అంటూ మరింత క్రూరంగా అరిచాడు.

అందరం సైలెంటయిపోయాం. సెంటర్‌లో వైర్‌లెస్‌సెట్ పట్టుకుని నిలబడ్డ మరో పోలీస్ అధికారిటైమ్ చూసుకున్నాడు.

"ఆ టైమయింది! విజిల్ వేయండి" అంటూ అరిచాడతను నాలుగు వేపుల్నుంచీ పోలీస్ విజిల్స్ మార్మోగిపోయినయ్ మళ్ళీ.

అంతా ఆశ్చర్యంగా అయోమయంగా చూస్తున్నారు.

"అమ్మా-అబ్బా-" అంటోంది ఆటోలో నొప్పులుపడతోన్న చంద్రకాంత్ భార్య.

ఆమె గొంతు వినడంతోనే "ఖామోష్" అంటూ భీకరంగా అరిచాడు. మా ముందు నిలబడ్డ కానిస్టేబుల్. ఇన్‌స్పెక్టర్ మండిపడుతూ మా ఆటో దగ్గరకొచ్చాడు.

"ఏయ్ ఎవళ్ళిక్కడ దిల్లగీ చేస్తున్రు" తీవ్రంగా అడిగాడు.

"ఆమెకు నొప్పులొస్తున్నాయండీ! అందుకని అరుస్తోంది."

"నొప్పులొస్తే డిస్ప్రిన్ టాబ్‌లెట్స్ వేసుకోమనవయ్యా! అరిస్తే ఎలా?" మరో కానిస్టేబుల్ మా దగ్గరకొచ్చాడు.

"ఆ నొప్పులు కాదండీ! ఆమెకు నెలలు నిండాయ్. డెలివరీకి హాస్పిటల్‌కి తీసుకెళు తున్నాం. ఇప్పటికే ఆలస్యం అయిపోయింది మాఆటోని వదిలేస్తే మేము వెళ్ళిపోతాం" చెప్పాడు రంగారెడ్డి.

ఆమాట వినడంతోనే ఇన్‌స్పెక్టర్ కోపంగా రంగారెడ్డి దగ్గర కొచ్చాడు.

"మీకేందమాకున్నదా? రెండు నిమిషాలు మౌనంగా నిలబడనికి లొల్లిపెడతరేమయ్యా! అయినాగాని ఆమెకిదే టైమ్‌దొరికిందా నొప్పులు తెచ్చుకోడానికి?"

"కానీ ఇప్పటికి మమ్మల్ని నిలబెట్టి అయిదు నిమిషాలయింది కద్సార్" అడిగాడు శాయిరామ్.

"ఇగో ఎక్కువతక్కువ మాట్లాడకంఢ్రి తొమ్మిదిగంటలకెల్లి తొమ్మిదీ రెండు నిమిషాల వరకూ ఖామోషీతోటుండాలె!"

"ఎందుకు సార్! ఇటువేపు సి.ఎమ్‌గానీ, గవర్నర్‌గానీ వెళుతున్నారా?" అడిగాడు ఇంకో స్కూటర్‌వాలా.

"నిన్ననే పేపర్ల ఇచ్చినం! ఇయాళ మార్టీర్స్‌డే అని సదవలే నువ్వు? తొమ్మిది గంటలకెళ్ళి

తొమ్మిదీ రెండు నిమ్షాల వరకూ పూరాశహార్ రుకాయిస్తదని టి.వి.లో కూడా జెప్పిను. ఇనలే?" మరింత కోపంతో అన్నాడతను.

"మార్టీర్స్‌డే అంటే ఏమది?" కుతూహలంగా అడిగాడు యాదగిరి.

ఇన్‌స్పెక్టర్ కొంచెం కన్‌ఫ్యూజయాడు.

"ఏయ్ నీయవ్వ- మార్టీర్స్‌డే అంటే ఎరుకలేదువయ్యా? కైసేకైసే లోగ్‌హైభయ్ యేశహర్‌మే" అనేసి అక్కడనుంచి జారుకున్నాడు.

సరిగ్గా తొమ్మిదిగంటలకు మళ్ళీ విజిల్స్ మార్మోగిపోయినయ్.

అందరం రెండునిమిషాలు ఎప్పుడవుతుందా అనివాచీలు చూసుకోసాగాము. మా వెనుక పెరిగిపోతున్న వాహనాల హారన్స్, కేకలు, అరుపులు ఇంకా పెరిగితూనేవున్నాయ్.

ఆటోలో చంద్రకాంత్ భార్య వేసేకేకలు ఎక్కువయి పోతూనే వున్నాయ్. సరిగ్గా తొమ్మిదీరెండుకీ ట్రాఫిక్ కదిలేందుకు అనుమతి ఇచ్చారు పోలీసులు. అప్పటికే అన్నివేపులా ట్రాఫిక్ పెరిగిపోవడం వల్ల మామూలుగానే ట్రాఫిక్ జామ్ అయిపోయింది.

ఆ జామ్ నుంచి మేమూ, మా ఆటో బయటపడేసరికి పదయిపోయింది. అప్పటికే చంద్రకాంత్ భార్యకు నొప్పులెక్కువయిపోయి గట్టిగా ఏడ్చేస్తోంది.

"ఆటో త్వరగా పోనీ" అరిచాడు శాయిరామ్.

ఆటో డ్రైవర్ వేగం పెంచాడుగానీ మళ్ళీ గట్టిగా పోలీసులు విజిల్స్‌వేస్తూ ఎక్కడి వాహనాలక్కడ ఆపేస్తూకనిపించారు.

లాఠీతో మావేపు దూసుకొచ్చి మా ఆటోనూ, స్కూటర్లనూ, మోపెడ్‌ని రోడ్డుపక్కకు నెట్టేశాడు ఓ కానిస్టేబుల్.

"మళ్ళీ ఏమిటిప్పుడు?" కోపంగా అడిగాడు రంగారెడ్డి ఆ కానిస్టేబుల్‌ని.

"గవర్నర్ ఓల్డ్‌సిటీలో 'పౌరుల ఇక్కట్లు' అనే సదస్సు ప్రారంభోత్సవాని కెళుతున్నారు. ఆ కార్లు వెళ్ళేవరకూ ట్రాఫిక్ ఆగాలి."

"కాని ఇవతల మా ఆవిడ పురిటి నొప్పులతో బాధపడుతోందయ్యా!" ఆదుర్దాగా, అన్నాడు చంద్రకాంత్.

"కుదరదండీ! గవర్నర్ వెళ్ళేవరకూ ఎవరు కదలడానికి వీల్లేదని మా అసిస్టెంట్ కమీషనర్ గారు గట్టిగా చెప్పారు."

"అంటే డెలివరీకేసుల్ని కూడా ఆపేయమన్నారా?"

"డెలివరీ ఏమిటి సార్? హార్ట్ ఎటాక్ కేసులయినా సరే! గవర్నర్ వస్తున్నారంటే నిలబడిపోవాల్సిందే!"

"ఈ లోపల ఆ పేషంట్‌హార్ట్ ఎటాక్ ఎగిరిపోతే?"

"పోతే పోనీండి సార్! గవర్నర్ ప్రారంభోత్సవం కంటే ఎక్కువా ఒక ఆర్డినరీ సిటిజన్ ప్రాణం?"

అప్పుడే చంద్రకాంత్ భార్యమళ్ళీ బాధగా అరవడం మొదలుపెట్టింది ఆటోలోంచి.

"బాబ్బాబు మమ్మల్ని రోడ్‌దాటనీయండి సార్! హాస్పిటల్ వరకూ చేరుకున్నాక ఇక్కడిలా ఆపేయడం భావ్యం కాదు"బ్రతిమాలాడు శాయిరామ్.

"అరె! చెపుతూంటే నీక్కాదయ్యా! మిమ్మల్ని వదిలానంటే నా ఉద్యోగం పోతుంది?"

"చూడండి! ఆపదలో ఉన్న గర్భవతి ప్రాణం ముఖ్యమా, మీ ఉద్యోగం ముఖ్యమా మీకు?"

అతను ఓ క్షణం ఆలోచించాడు.

"నా ఉద్యోగమే ముఖ్యం" అన్నాడు వెంటనే. "రెండు లక్షలు పెట్టి కొనుక్కున్నానిది" అందరం ఉలిక్కిపడ్డాం.

యాదగిరి మోపెడ్‌దిగి దగ్గరకువచ్చాడు.

"పోనీ ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌కి తీసుకెళ్దాం భాయ్! పాపం ఆమెకు నొప్పులు బడాయించి పోయినయ్" అన్నాడు ఆదుర్దాగా.

"ఇక్కడెక్కడుంది నర్సింగ్‌హోమ్?" అడిగాను నేను.

"ఆ రెండో స్ట్రీట్‌లో ఉంది. వెనక్కుపోదాం పదండ్రి ఈ గవర్నర్ ఎప్పటికొచ్చేనో ఏమో?"

అందరం ఆటో తీసుకుని వెనక్కు తిరిగాం.

చంద్రకాంత్ వాళ్ళావిడ బాధచూడలేక తనూ ఏడ్చేస్తున్నాడు.

తీరా నర్సింగ్‌హోమ్ ఇవతల చౌరస్తా దగ్గరకొచ్చేసరికి మళ్ళీ పోలీసులు చాలా మంది రోడ్డుకి అడ్డంగా నిలబడి కనిపించారు.

"ఏయ్! ఆటో! రోకో– ఉధర్‌రాస్తా బంద్ హై" అరిచాడు ఓ కానిస్టేబుల్.

మా గుండెల్లో రాళ్ళు పడినయ్.

"రాస్తా ఎందుకు బంద్‌వుంది?"

"గణేష్ నిమజ్జనం ప్రొసెషన్ వెళుతోంది– డైవర్షన్ లెఫ్ట్‌కి వెళ్ళిపోండి" అరిచాడు ఓ ఇన్‌స్పెక్టర్.

"కానీ మేము రైట్‌కి తిరిగి ఆ నర్సింగ్‌హోమ్ కెళ్ళాల్సార్. చాలా అర్జెంట్! డెలివరీకేస్" ఆత్రుతగా చెప్పాడు రంగారెడ్డి.

"లెఫ్ట్ కెళ్ళి తిరిగిరండి! కమాన్! ఛలో" మామాట వినిపించుకోకుండా అరిచాడు.

"కానీ లెఫ్ట్ కెళితే ఎక్కడికెళతాం సార్? మళ్ళీ కాచిగుడా అంతా తిరిగి రావాలికదా?"

"ఏయ్! పోతారా లేదా?" లాఠీ తీసుకొస్తూ అరిచాడు ఇంకో కానిస్టేబుల్. చేసేదిలేక అందరం లెఫ్టతిరిగిపోయాం.

ఆ సందు ఎక్కడికెళుతుందో ఎవరికీ తెలీదు.

చాలాసేపు ఆ సందులో వెళ్ళాక ఆటో కాచిగుడా చేరుకుంది.

అక్కడినుంచీ ఎక్కడికెళ్ళాలో ఎవరికీ అర్థంకాలేదు.

"పోనీ కింగ్‌కోఠీలో ఇంకో హాస్పిటల్ వుంది అక్కడికెళదాం" అన్నాడు గోపాల్రావ్.

"దానికెలా వెళ్ళాలి?"

"తిన్నగా వెళ్ళడానికి వీల్లేదు వన్‌వే!" అన్నాడు ఆటోడ్రయివర్.

"అయితే నారాయణ్‌గూడా మీదుగా వెళదాం" అన్నాడు జనార్ధన్.

ఊరేగింపు మళ్ళీ నారయణ్‌గూడావేపు మళ్ళింది.

హఠాత్తుగా అక్కడ మళ్ళీ పోలీసులు అడ్డం నిలబడి కనిపించారు. మాకు కోపం ఆగడం లేదు.

"బహుశా ఇలా భార్యను డెలివరీకోసం హాస్పిటల్‌కి తీసుకెళడానికి ప్రయత్నించిన వాళ్ళే నగ్జలైట్స్‌గా మారిపోయి వుంటారు" అన్నాడు రంగారెడ్డి కసిగా.

"ఇటు వెళ్ళడానికి వీల్లేదు!" అరిచాడు కానిస్టేబుల్.

"ఏం? ఎందుకని?"

"వెస్టిండీస్– ఇండియా క్రికెట్‌మాచ్ కదయ్యా! ఆ మాత్రం తెలీదా? ట్రాఫిక్ డైవర్షన్"

"అవతల ఆడమనిషి పురిటినొప్పులతో బాధపడుతోందయ్యా! అర్జంటుగా హాస్పిటల్‌కి తీసుకెళ్ళాలి. మీకేమాత్రం మానవత్వం లేదా? ఇటు వెళ్ళనివ్వండి మమ్మల్ని" కోపంగా అన్నాడు గోపాల్రావ్.

కానిస్టేబుల్ వినిపించుకోకుండా లాఠీతో మాఆటోమీద కొట్టాడు.

"ఛల్ జల్దీ ఛలో" అంటూ అరిచేసరికి ఆటోడ్రైవర్ గాబరాపడి ఆటోని యూనివర్శిటీ రోడ్‌వేపు తిప్పేశాడు.

"పోనీ తార్నాకా మీద నుంచీ సికింద్రాబాద్ వెళ్ళి గాంధీ హాస్పిటల్లో చేర్పిద్దాం" అన్నాడు చంద్రకాంత్.

అప్పటికే అతని భార్య బాధతో స్పృహతప్పేట్లు కనబడుతోంది. ఆయాసంతో ఒగరుస్తూ అరవడానికి కూడా శక్తి చాలనట్లువుంది.

తీరా తార్‌నాకాకెళ్ళేసరికి మళ్ళీ పోలీసులు.

"ఆగండి! రోకో! ఠైరో" అంటూ అరుపులు, విజిల్స్.

"ఏమిటి మళ్ళీ? మీరున్నది జనాన్ని నరకయాతన పెట్టడానికా? ట్రాఫిక్ ఆగకుండా స్మూత్‌గా నడిచేట్లు చూడ్డానికా? మీకేమయినా బుద్ధుందా అసలు? అవతల ఆడకూతురు పురిటి నొప్పులతో బాధపడుతోందయ్యా అంటే ఒక్కనాకొడుకూ వినిపించుకోరేం?" అంటూ ఎలుగెత్తి అరిచాడు రంగారెడ్డి.

ఆ కేకలతో ఆగిపోయిన జనం మావేపు తిరిగారు. చంద్రకాంత్ భార్య అప్పటికే స్పృహతప్పింది.

"సార్! నా భార్య ప్రాణం పోయేట్లుంది సార్! ఇంక జన్మలో ఆంధ్రప్రదేశ్‌లో పిల్లల్ని కననని ప్రామిస్ చేస్తున్నాను సార్! ఈ ఒక్కసారికి క్షమించి మా ఆవిడను రక్షించండి సార్!" అంటూ ఏడ్చేస్తూ పోలీస్ ఇన్‌స్పెక్టర్ కాళ్ళమీదపడ్డాడతను.

ఇన్‌స్పెక్టర్‌కి మా అందరినీ చూసి జాలివేసినట్టుంది "ఇదిగో చూడండి బ్రదర్! మేమేమీ చేయలేని నిస్సహాయస్థితిలో వున్నాం! రోజూ ఈ టైమ్‌కి మన ముఖ్యమంత్రిగారు 'విశ్వామిత్ర' షూటింగ్‌కి వెళతారని తెలుసుకదా! తెలిసికూడ ఈ రోడ్‌కెందుకొచ్చారు? ఆయన స్టూడియో కెళ్ళేవరకూ ట్రాఫిక్‌ని వదలడం కుదరదు."

"పోనీ ఈ ఆటో ఒక్కటి వదిలేయండి సార్- ప్రమాద స్థితిలో ఉన్నారంటున్నారు కదా?" పక్కనున్నతను సలహా ఇవ్వబోయాడు.

"ఏయ్! నీ సంగతి నువు చూసుకో! అర్ధమయిందా? ఈ ఆటోని వదిలామంటే అంతా ప్రమాదస్థితి అంటూ వెళ్ళిపోతారు. మొన్నిట్లనే ఓ యాక్సిడెంట్ జరిగినప్పుడు తలకు దెబ్బలు తగిలినయ్యని వాడెక్కిన ఆటోని హాస్పిటల్‌కి విడిస్తే ఏమయింది? ఆటో వీల్ విరిగిరోడ్ మధ్యలో పడిపోయింది. ఆటోవాడూ, యాక్సిడెంట్‌కి గురయి దెబ్బలు తగిలినవాడూ ఇద్దరూ చచ్చారు. దాంతో 'విశ్వామిత్ర' షూటింగ్ అరనిమిషం లేటయిపోయింది. ఎంత దారుణమో చూడండి."

చంద్రకాంత్‌కి పిచ్చెక్కిపోయినట్టయింది.

హఠాత్తుగా కానిస్టేబుల్ చేతిలోని లాఠీ లాక్కుని పెద్దగా అరుస్తూ పోలీసుల మీదకు దూకాడు.

"అరేయ్- నా భార్య చావు బ్రతుకుల్లో వుందిరా! నీయమ్మ- ప్రారంభోత్సవాలూ, క్రికెట్లూ, దేవుడి ఊరేగింపులూ, సినిమా షూటింగ్‌లూ- కొడకల్లారా- ముందు మనిషిని బ్రతికించండ్రా బాడ్‌కవ్ సాలే!"

పోలీసులందరూ కలసి చంద్రకాంత్‌ని పట్టుకుని వానులో వేసేవారు. ఇద్దరు కానిస్టేబుల్స్ చంద్రకాంత్‌ని కదలకుండా మీదెక్కి కూర్చున్నారు.

మరో అయిదు నిమిషాల తర్వాత పోలీస్ సైరనుతో జీపూ, దాని వెనక మేనక కారూ, దాని వెనక విశ్వామిత్రకారూ, దాని వెనక తెలుగుదేశం పార్టీకారూ అన్నీ వెళ్ళిపోయినయ్.

మేము ఆటో తీసుకుని గాంధీ హాస్పిటల్ వేపు బయలుదేరాం. ఆటోడ్రయివర్ చాలావేంగా నడపసాగాడు.

ఆటో కొద్దిదూరం వెళ్ళిందో, లేదో హఠాత్తుగా స్పీడ్ బ్రేకర్ అడ్డువచ్చింది. దాంతో బ్రేకింగ్ డిస్టెన్స్ చాలకపోవడం వల్ల ఆటో ఎగిరిపడింది.

మరుక్షణంలో "కేర్" మంటూపాపాయి ఏడుపు వినిపించింది.

ఆటోడ్రైవర్ ఆటో ఆపి ఆనందంగా మా దగ్గరకొచ్చాడు.

"నాకు తెల్సుసార్! ఇదే స్పీడ్ బ్రేకర్ దగ్గర ఎనిమిది మంది ఆటోలోనే డెలివరీ అయ్యారు. ఇది స్పెషల్ స్పీడ్ బ్రేకర్ సార్! ఎంత నెమ్మదిగా వెళ్ళినా నాలుగడుగులు పైకెగిరి పడేట్లు డిజైన్ చేయించింది మన స్టేట్ గవర్నమెంట్!"

మా ఆవిడ ఆటోలోనుంచి తొంగి చూసింది.

"ఏవండోయ్- ఆడపిల్ల" అంది నవ్వుతూ! "ఆటో వెనక్కు తిప్పమనండి! ఇంటి కెళ్ళిపోదాం!"

ఆటో వెనక్కు పంపించి నేనూ, రంగారెడ్డి, యాదగిరి, పోలీస్‌స్టేషనుకి బయలుదేరాం- చంద్రకాంత్‌ని విడిపించి తీసుకురావడానికి.